**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 26.07.2026** **సమయం:18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ ఉండాలని, నీటి వృధాను పూర్తిగా నివారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. మన్ కీ బాత్ 136 వ సంచిక ద్వారా ప్రధాని ఈరోజు దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.
2. తెలంగాణలోని చేనేత కార్మికులు 'లోకల్ ఫర్ వోకల్ స్ఫూర్తితో చేపట్టిన ఇక్కత్ చేనేత వస్త్రాల కళా నైపుణ్యం ఎంతో ప్రశంసనీయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
3. ఎల్ నినో ప్రభావం వల్ల ఎదురయ్యే సవాళ్ళను శాస్త్రీయ అవగాహన పద్ధతులతో అధిగామించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.
4. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

..........................................................

**మన్ కీ బాత్**

దేశ సరిహద్దులను కాపాడుతూ ప్రాణత్యాగం చేసిన ప్రతి అమర జవాన్ లకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మన్ కీ బాత్ 136 వ సంచిక ద్వారా ఆయన ఈరోజు దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. నేడు కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా వీర సైనికులకు ఘన నివాళులు అర్పించారు. కార్గిల్ యుద్ధం కేవలం సైనిక విజయ మాత్రమే కాదు భారతదేశ ఐక్యత ధైర్యం సంకల్పానికి నిదర్శనమని ఆయన

అన్నారు. నేటి యువత ఆ వీరుల త్యాగాలను తెలుసుకొని దేశ సేవ పట్ల అంకితభావాన్ని పెంచుకోవాలని ప్రధానమంత్రి సూచించారు.

**బైట్ 1....**

ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే ప్రజలు భాగస్వామ్యం ఎంతో అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ రహిత భారత్, సామాజిక సేవ వంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీహార్‌లోని సీతామఢిలో ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగించి ఆకర్షణీయమైన బెంచీలను తయారు చేస్తున్న ప్రక్రియను ప్రధానమంత్రి ప్రస్తావించారు.

**బైట్ 2.....**

ఆత్మ నిర్భర్ భారత్, మేకిన్ ఇండియా.... ద్వారా రక్షణ రంగంలో కొత్త శకానికి నాంది పలికామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రక్షణసామాగ్రి కోసం ఒకప్పుడు విదేశాల పై ఆధారపడిన భారత్, ఇప్పుడు ప్రపంచానికి రక్షణ సామాగ్రిని ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటోందన్నారు. యుద్ధ నౌకలు, క్షిపణులు, రాడార్ వ్యవస్థ పరికరాలు మనదేశంలోనే తయారు అవుతుందన్నారు.

**బైట్ 3.....**

ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ ఉండాలని, గ్రామాల్లో చెరువులు, కుంటలు,బావులను పునరుద్ధరించాలని నీటి వృధాను పూర్తిగా నివారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టే 'క్యాచ్ ద రెయిన్' అనే అంశాన్ని ఉద్యమస్ఫూర్తితో కొనసాగించాలని ఆయన అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే జల భద్రత – జల సంరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ లోని సిధి జిల్లాలో చేపట్టిన చెరువుల నిర్మాణాన్ని ఆయన ప్రస్తావించారు.

**బైట్ 4.....**

లోకల్ ఫర్ వోకల్ స్ఫూర్తితో స్థానిక కళాకారులను, కార్మికుల నైపుణ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా అద్భుతాలను ఆవిష్కరించవచ్చని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తెలంగాణలోని పోచంపల్లి చేనేత కార్మికుల ఇక్కత్ కళా నైపుణ్యాన్ని ఆయన ప్రధానంగా ప్రశంసించారు. అలాగే దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ఉన్న చేనేత కార్మికుల ప్రతిభను ఆయన కొనియాడారు.

**బైట్ 5.....**

ఆరోగ్యవంతమైన భారత ఆవిష్కారానికి క్రీడలు మార్గదర్శకం వహిస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలు స్ఫూర్తి నింపాలని, ఫిట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో క్రీడాకారులు ముందడుగు వేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దేశంలో ఇటీవల వివిధ క్రీడా అంశాలలో క్రీడాకారులు సాధించిన విజయాలను ఆయన ప్రస్తావించారు.

**బైట్ 6.....**

భారత అంతరిక్ష రంగంలో విక్రమ్ – 1 ప్రయోగం విజయవంతం కావటం చిరస్మరణీయమైన ఘట్టమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రైవేటు రంగం అభివృద్ధి చేసి ప్రయోగించిన మొట్టమొదటి రాకెట్ గా విక్రమ్ చరిత్ర సృష్టించిందని ఆయన పేర్కొన్నారు. యువ ఆవిష్కర్తల దీక్షా దక్షతలకు నైపుణ్యానికి ఇది నిదర్శనమని మోదీ అభివర్ణించారు.

**బైట్ 7....**

**మన్ కీ బాత్ స్పందన**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని విన్న సిరిసిల్లా జిల్లా వాసి గురజాల రాజు ఆకాశవాణికి తమ స్పందనను తెలియజేశారు.

**BYTES**

**ANNOUNCEMENT**

ప్రధానమంత్రి మన్ కీ బాత్ ప్రసంగానికి తెలుగు అనువాదం ఈ రాత్రి 8 గంటలకు పునః ప్రసారమవుతుంది.

**తుమ్మల**

ఎల్ నినో ప్రభావం వల్ల ఎదురయ్యే సవాళ్ళను శాస్త్రీయ అవగాహన పద్దతులతో అధిగామించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. రాష్ట్రంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదవుతుందని రైతులు పరిస్థితులను అవగాహన చేసుకొని పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. వరికి బదులుగా కంది, పెసర, మినుము, జొన్న, నూనె గింజలు, కూరగాయలు, ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా ప్రభుత్వం ముందస్తు ఏర్పాటు చేసిందని , అవసరమైతే అదనపు విత్తనాలను కూడా సమకూరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

....డెస్క్

**ప్రజా భవన్ – బోనాల వేడుకలు**

సమైక్య జీవన విధానానికి సామూహిక భక్తి చైతన్యానికి బోనాల వేడుకలు నిదర్శనమని, తెలంగాణ గ్రామీణ సంస్కృతికి ఈ సంబరాలు ప్రతీకలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ రోజు హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో జరిగిన నల్లపోచమ్మ బోనాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.  ఈ కార్యక్రమంలో మంత్రులు  కొండా సురేఖ ,  ధనసరి

సీతక్క , పొన్నం ప్రభాకర్ , వాకిటి శ్రీహరి కలసి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పిటిసి- హైదరాబాద్

**సజ్జనార్**

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉందని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి సి సజ్జనార్ సూచించారు. అపరిచిత లింకులతో, నకిలీ కాల్స్ తో, నకిలీ వెబ్ సైట్లతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. డబ్బు కడితే ఇల్లు ఇప్పిస్తామనే ఫోన్ కాల్స్ ని నమ్మవద్దని, సైబర్ మోసాల పై 1930 నెంబర్ కు కాల్ చేయాలని పోలీస్ కమిషనర్ అన్నారు.

....పిటిసి – హైద్రాబాద్

**SIR**

హైదరాబాద్ సనత్‌నగర్ నియోజకవర్గంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ క్షేత్రస్థాయి పర్యటన చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను ఆయన సమీక్షించారు. ఎలాంటి తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. అర్హులైన నివాసితులందరూ తమ ఫారాలను సకాలంలో సమర్పించాలన్నారు.

పిటిసి- హైద్రాబాద్

**కార్గిల్ విజయ్ దివస్**

ఈ రోజు కార్గిల్ విజయ్ దివస్ ను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ర్యాలీ నిర్వహించారు. ఆసిఫాబాద్ లో పలు కళాశాలల, పాఠశాలల విద్యార్థులు కార్గిల్ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. మహబూబా బాద్ లో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతపట్టి

అమర జవానులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీ నాయక్ పాల్గొన్నారు. దేశ సమగ్రత పరిరక్షణలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మంచిర్యాలలో జరిగిన కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ లో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.

పిటిసి- ఆసిఫాబాద్, మహబూబా బాద్, మంచిర్యాల

**విజయవాడ బోనాలు**

విజయవాడ లోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కనకదుర్గమ్మకు భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల దేవాలయాల ఊరేగింపు కమిటీ బంగారు బోనాన్ని సమర్పించింది. గత 16 సంవత్సరాలుగా ప్రతిఏటా దుర్గమ్మకు బోనాలను ఈ కమిటీ ఆధ్వర్యంలో సమర్పిస్తున్నారు.

....డెస్క్

**వాతావరణం**

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడిందని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారి, పారాదీప్ – సాగర్ ద్వీపాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ లో, తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

.....పీఎన్